సేవామార్గంలో యువత





అనాథ మృతదేహానికి అంత్యక్రియలు జరిపిస్తున్న ఖుద్దామ్ముల్ కమిటీ సభ్యులు, పేదల ఇంట్లో పెళ్లికి వంట సరుకులు అందజేస్తున్న దృశ్యం, విద్యార్థినికి ఫీజు అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు రఫీక్, సభ్యులు

- సమాజ సేవే లక్ష్యంగా.. నేటి యువతకు ఆదర్శంగా
- అభాగ్యులకు అండగా నిలుస్తున్న ఖుద్దాముల్ కమిటీ

గుంతకల్లుటౌన్: సాయం చేయడానికి కావాల్సింది సంపద కాదు స్పందించే హృదయం. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఆస్తుల కంటే ఆలోచన అవసరం. మానవత్వం మనిషిని దేవుణ్ణి చేస్తుంది. మరణాన్ని సైతం ఓడిస్తుంది. ఈ విషయాన్నే నిరూపిస్తున్నారు గుంతకల్లుకు చెందిన పలువురు ముస్లిం యువకులు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే వారు కొందరైతే చదువుకునే వారు మరికొందరు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అనే సూక్తిని ఒంటబట్టించుకున్న ఆ యువకులు జమాతే ఖుద్దాముల్ ముస్లిమీన్ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేసుకుని విశిష్ట సేవలందిస్తూ నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఖుద్దాముల్ కమిటీ ద్వారా ఉచిత వివాహాలు చేయడం, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సాయం అందిచడం, రంజాన్ తోఫా పంపిణీ, అనాథ మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు.

అభాగ్యులకు అండ..

సమాజానికి సేవచేస్తూ అభాగ్యులకు అండగా నిలవాలన్న ఆలోచన ఆ ముస్లిం యువకులందరినీ ఏకం చేసింది. తమ సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తూ దాతల సహకారంతో నిరుపేద పిల్లల చదువులకు ఆర్థిక చేయూతనందించడంతో పాటు నిరుపేద ముస్లింల వివాహ వేడుకల్లో నిఖా రోజున అయ్యే భోజన ఖర్చుతో పాటు వధూవరులకు పెళ్లిదుస్తులు, ఇతర సామగ్రిని అందజేస్తున్నారు గుంతకల్లుకు చెందిన జమాతే ఖుద్దాముల్ ముస్లిమీన్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు. 2014లో పట్టణానికి చెందిన పాన్‌షాపు నిర్వాహకుడు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో అతని మిత్రులు నౌషద్ అలీ, షబ్బీర్, జిలాన్, జలీల్, శర్మస్, అబ్దుల్ తదితర యువకులు ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తమ సంపాదనలో కొంత మొత్తంతో పాటు సహృదయం కలిగిన మానవతావాదులు అందిస్తున్న సహకారంతో ఇప్పటివరకు 196 పెళ్లిళ్లలో నిఖా రోజున 350 మందికి భోజన వసతిని కల్పించి పేద వధూవరులకు అండగా నిలిచారు. అంతేకాకుండా 120 అనాత శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఏటా ఐదుగురు పేద విద్యార్థుల చదువులకు (పుస్తకాలు, ఫీజులు) అయ్యే ఖర్చును భరిస్తున్నారు. ప్రతి యేటా రంజాన్ మాసంలో 150 నిరుపేద ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా(నిత్యావసర సరుకులు) అందజేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కూతురి వివాహానికి సరుకులందించారు

నేను ఇళ్లల్లో , నా భర్త శర్మస్‌వలి టీ స్టాల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాం. మేము నిరుపేదలం. మా చిన్నకూతురు వివాహం చేసే ఆర్థికస్థోమత లేక ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది జనవరిలో జరిగిన మా కూతురు వివాహం సందర్భంగా ఖుద్దాముల్ కమిటీ వారు 350 మంది భోజనానికి సరిపడా వంట సరుకులన్నీ ఇప్పించారు. అంతేకాకుండా ఈద్గా ఫంక్షన్‌హాల్ కూడా ఉచితంగా ఇప్పించి మాకు చాలా సాయమందించారు. ఖుద్దాముల్ కమిటీ ప్రతినిధులు చేస్తున్న సేవలు మరువలేనివి. – **ఆశాబీ, తిలక్‌నగర్, గుంతకల్లు**

సాయమందించాలన్నదే లక్ష్యం



ఆపదలో ఉన్న వారికి సాయమందించాలని భావించి 2014లో ఖుద్దాముల్ ముస్లిమీన్ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేశాం. హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో హుండీలు ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన డబ్బుతో పాటు దాతలందించిన సొమ్ముతో పేద విద్యార్థులకు ఫీజులు, నిరుపేదల పెళ్లిళ్లకు నిత్యావసర సరుకులు, వైద్యఖర్చులు, రంజాన్ తోఫా అందించాం. అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుంటాం. సేవా కార్యక్రమాలకు చేదోడువాదోడుగా నిలుస్తున్న దాతలందరికీ రుణపడి ఉంటాం. – **మహమ్మద్ రఫీక్, ఖుద్దాముల్ కమిటీ అధ్యక్షుడు**

క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట



ఆలయ గోపురం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో అర్చకులు, వేదపండితులు ఆదివారం వేకువజాము నుంచి వేద మంత్రాల నడుమ హోమాలు, అభిషేకాలు, అర్చన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మ ముహూర్తంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం



ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం అర్చకులు సుధీర్ కుమార్‌శర్మ, సునీల్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ తదితరులు నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను భజనకీర్తనలు ఆలపిస్తూ ప్రత్యేక పూలపల్లకిలో ఊరేగించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు మొక్కుబడి ఉన్న భక్తుల కోరిక మేరకు స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.


భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన పూజలు



అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు లక్ష బిల్వార్చన నిర్వహించిన దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి సర్వమంగళాభిషేకాలు చేపట్టారు. అనంతరం వందలాది మంది అయ్యప్ప మాలధారులు, భక్తుల నడుమ లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్చీలలో ఆరాధనోత్సవం



సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో దైవదాసులు పీవీఎస్ రాజు క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుడితో బంధం తెంచుకోవడమే పాపానికి మూలమన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, రత్నరాజు, బుజ్జిబాబు, కరుణాకర్, రాజు, ప్రసాద్, రజని, డాక్టర్ కమల, రేచెల్, మహిమ, వాణి, రమాదేవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గుత్తి: పట్టణంలోని కమేళా వీధిలో నివాసముండే రాజేష్ కుమార్, మేరీ దంపతుల ఇంట్లో చోరీ జరిగింది. శనివారం వారు అనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికొచ్చారు. అప్పటికే తలుపులు తెరచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించారు. తెరచిఉన్న బీరువాను పరిశీలించగా ఐదు తులాల బంగారు ఆభరణాలు(రెండు ఉంగరాలు, ఒక లాంగ్ చైన్) కనిపించలేదు. వెంటనే వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకుందాం



దత్తపాదుకల పల్లకీ సేవ నగర ప్రదర్శన దృశ్యం

పామిడి: భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలు ఆచరించేలా ఒక్కరూ బోధించాలని దత్త మహాయోగ పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ అన్నారు. ఆదివారం దత్త నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భక్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపాదన ఎంత ముఖ్యమో.. మన సంస్కృతి, సాంప్రదాయ బోధనకు అంత ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కవి నారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. అనంతరం దత్త పాదుకలను పల్లకి సేవలో ఉంచి భక్తాదుల భజన సంకీర్తనాలాపనల నడుమ నగర ప్రదర్శన గావించారు. అలాగే దత్త జయంతి నవరాత్రి వేడుకలను నియమ నిష్టలతో ఆచరిస్తూ భక్తుల్లో దైవ చింతనను పెంపొందింపజేస్తున్న పీఠాధిపతి సురేంద్ర మహారాజ్‌ను భక్తులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సన్మానించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న బీకేఎస్ ఎస్‌ఐ శేషగిరి రావు

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. ఆదివారం మండల కేంద్రం గార్లదిన్నె, కల్లూరులో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. కారు నడిపేవారు సీట్‌బెల్టు, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. అంతకుముందు వాహనాలు తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా లేని వారికి అపరాధరుసుం విధించారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అనంతపురం–తాడిపత్రి రహదారిపై ఆదివారం ఎస్‌ఐ శేషగిరి రావు, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



గుంతకల్లులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆవోపా నాయకులు



యాడికిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు



గుత్తిలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు/గుత్తి/యాడికి/గార్లదిన్నె/బుక్కరాయ సముద్రం/: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను గుంతకల్లు పట్టణంలోని ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి ఆవోపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవోపా నాయకులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, వెంకటేశ్వర్లు, హరిహరినాథ్, రాజా రమణ, రాజేంద్ర, సోమనాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, మున్సిపల్ అధికారులు వేర్వేరుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, సభ్యులు నాగ సుదర్శన్, వెంకటేష్, శివ మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యాడికి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం మండలంలోని ఆర్యవైశ్యులు ఆయన వర్ధంతి ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శేఖర్, ఆర్యవైశ్యులు పవన్, రాజు, కేదార్, రవి, మురళి, ప్రదీప్, లక్ష్మినారాయణ, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలోని ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల ఆత్మార్పణం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానంద రెడ్డి, ఎంఈఓ చంద్రనాయక్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బుక్కరాయసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత, ఈఓఆర్డీ సదాశివ, ఏపీఓ పోలేరయ్య, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి అక్రమ నిర్మాణం కన్పించదా?

- ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపకుడు



చాకలివీధిలో వాటర్ ప్లాంట్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన దృశ్యం

పామిడి: టీడీపీ నేత అక్రమ నిర్మాణం అధికారులకు కనిపించదా అని ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని తెలుగు తమ్ముడు శివశంకర్ 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కబేళా స్థలానికి (ప్రభుత్వ స్థలానికి) దొంగ పట్టా సృష్టించి, ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ చేశారన్నారు. 2021 మార్చి 1న అప్పటి మున్సిపల్ టీపీఓ కృష్ణారావు, తహసీల్దార్ పట్టా రికార్డును పరిశీలించి అది ఫేక్ పట్టాగా తేల్చారు. దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ అనుపమ, టీపీఓ కృష్ణారావు, సర్వేయర్ బ్రహ్మానందం ఆ ప్లాంట్‌ను సీజ్‌చేసిన విషయం తెలిసిందే. మళ్లీ కూటమి అధికారంలోకి రాగానే ఆ టీడీపీ నేత సీజ్ చేసిన వాటర్ ప్లాంట్‌ను అధికారుల అనుమతి లేకుండానే పునః ప్రారంభించడంపై ఐక్య మాదిగ సమాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆదివారం అదునుగా చూసుకొని తెలుగుతమ్ముడు శివశంకర్ ఆ ప్లాంట్ వద్ద బండ పరువు వంటి అక్రమ నిర్మాణం చేపట్టడాన్ని ఆయన తప్పు బట్టారు. ఎవరైనా నిరుపేద, దళితులు ప్రభుత్వ స్థలాల్లో ఒకటి, రెండు అడుగులు ఆక్రమిస్తున్నారని తెలిస్తే ఆదివారం అయినా అధికారులు రెక్కలు కట్టుకొని వచ్చి ఆపేస్తారు. అలాంటిది అధికారపార్టీ నేత బహిరంగంగా అక్రమ నిర్మాణం చేపడుతున్నా అధికారులకు తెలియకపోవడం శోచనీయమన్నారు. అధికారులు నిద్ర మేల్కొని, తమ పక్షపాతధోరణి వీడి అందరికీ ఒకేలా న్యాయం చేపట్టాల్సిన అవసరముందన్నారు. లేకపోతే ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు హాజరైన భక్తులు

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో వెంగమనాయుడు కాలనీలో ఆదివారం నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం కనులపండుగగా నిర్వహించారు. అర్చకుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి టెంకాయలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వేములపాడు మాజీ సర్పంచు వీకే ప్రదీప్ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫి, సీపీఐ నాయకులు తదితరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. విగ్రమ ప్రతిష్ట సందర్భంగా హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. ఆదివారం ఏఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.కొప్పలకొండ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2006–2007 లో పదో తరగతి చదివిన విద్యార్థులు కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు అప్పటి అల్లరిచేష్టలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: మండలంలోని తలారి చెరువు వద్ద గల సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంకటరమణ (41) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఆదివారం అప్‌గ్రెడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన వెంకటరమణ బేల్దారి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మొదటి భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా మనస్పర్థల వల్ల పుట్టింటికి వెళ్లడంతో మద్యానికి బానిసయ్యాడు. బంధువులు, పిల్లలతో కలసి ఈనెల 10న తాడిపత్రి మండలం తలారి చెరువు వద్ద గల దేవాలయానికి వెళ్లాడు. 11న ఉదయం నుంచి ఆయన అదృశ్యమయ్యాడు. ఈ క్రమంలో ఆయన మృతదేహాన్ని తలారి చెరువు వద్ద గల సోలార్ ప్లాంట్ వద్ద ఆదివారం పోలీసులు గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఎస్కేడీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని శ్రీనివాసులు, ధనుంజయ అనే వ్యక్తులు గాయపడ్డారు. గుత్తికి చెందిన వారు బైక్‌లో పామిడికి వెళుతుండగా.. రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎక్స్ సర్వీస్‌మెన్‌కు సన్మానం



మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: 1965 పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న ఎక్స్ సర్వీస్ మెన్ మల్లికార్జునరెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. గుంతకల్లులోని రాజేంద్ర నగర్‌కు చెందిన ఆయనను పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అనంతపురంలో ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సత్కారం అందుకున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగుడికి సరుకులను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక టీచర్స్ కాలనీలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి , సభ్యులు సత్యనారాయణ, ఆదినారాయణస్వామి, అశ్వర్థరెడ్డి, వెంకట్రామయ్య, రమణరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నాగేంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గుత్తి: గుత్తి పట్టణానికి చెందిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ 1104 విద్యుత్ యూనియన్ డివిజనల్ జనరల్ సెక్రటరీగా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ శంకర్ మాట్లాడుతూ నాగేంద్ర ప్రసాద్ భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డేనియల్(హెచ్‌ఎం), శ్రీనివాసులు(ఏఎస్‌ఐ), విజయ భాస్కర్ (అడ్వకేట్), ఉపాధ్యాయులు రవికుమార్, ప్రవీణ్, శివ కుమార్, సలీం, శ్రీధర్ గౌడ్, రవి చంద్ర, కుమార్, ఖాజా బాష, శ్రీనివాసులు, సత్య, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో నిల్వ ఉన్న బియ్యం వినియోగానికి ఆదేశాలివ్వండి



కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి వినతిపత్రం ఇస్తున్న విజయలక్ష్మి

గుంతకల్లు టౌన్: స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌లో గత రెండేళ్లుగా నిల్వ ఉంచిన 25 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వినియోగించడానికి ఆదేశాలివ్వాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాదజోషిని ఎఫ్‌సీఐ ఏపీ డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు. ఆదివారం కర్ణాటకలోని హుబ్లీకి విచ్చేసిన కేంద్ర మంత్రిని ఆమె కలసి వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల క్రితం పండిన బియ్యాన్ని రెండేళ్లుగా ఎఫ్‌సీఐలో నిల్వ ఉంచడం వల్ల ఆ బియ్యం నాణ్యత తగ్గిపోతోందన్నారు. ఎఫ్‌సీఐ, ఏపీ సివిల్ సప్లై శాఖలో జరుగుతున్న అవకతవకలపై గురించి మంత్రికి వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. ధాన్యం నిల్వకు ప్రభుత్వ గోదాములనే వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు ఆమె తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి

గుత్తి: పట్టణంలోని 14వ వార్డులో టీడీపీ నాయకుడు లడ్డు చంద్ర (60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, పలువురు నాయకులు మృత దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు.